

పల్ల వెంకన్న నర్సరీలో మువ్వన్నెల రెపరెపలు

ప్రజాశక్తి-కడియం

మువ్వన్నెలు జెండా కడియం పల్ల వెంకన్న నర్సరీలో రెపరెపలాడింది. గ్లోబల్ వార్మింగ్ ను అధిగమించేందుకు పచ్చదనాన్ని ప్రేమించాలని పిలుపునిస్తూ పల్ల వెంకన్న నర్సరీ యాజమాన్యం తీర్చిదిద్దిన ఈ ఆకృతి ఆద్యంతం సందేశాత్మంగా నిలిచింది. ల్యాండ్ స్కేపింగ్ డిజైనర్, పల్ల వెంకన్న నర్సరీ డైరెక్టర్ పల్ల వెంకటేష్ చేసిన మొక్కల కూర్పు సందర్శకులను ఆకటుకుంది. పంద్రాగస్టు వేడుకకుమా నూతన నర్సరీలో మొక్కలతో ఆవిష్కరించడం ఆనందంగా ఉందని నర్సరీ చైర్మన్ పల్ల సత్య నారాయణ మూర్తి, డైరెక్టర్ పల్ల వినయ్‌లు తెలిపారు.



పౌల్ట్రీ రైతు కుదేలు

- నిలకడలేని చికెన్ ధరలు
- నేలచూపులు చూస్తున్న కోడిగుడ్డు ధర
- నష్టాల బాటలో గోదావరి జిల్లా పౌల్ట్రీ రైతులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పౌల్ట్రీ రైతులు కుదేలవుతున్నారు. ఓ వైపు పెరుగుతున్న మేత ధరలు, విద్యుత్ ఛార్జీలు, మరో వైపు కోడి, కోడిగుడ్డు ధరలు నిలకడలేకపోవటమే ఈ దుస్థితికి కారణమని చెబుతున్నారు. ఏడాదిలో మూడు నెలలు పౌల్ట్రీ పరిశ్రమ ఆశాజనకంగా ఉంటుంది. మిగతా తొమ్మిది నెలలు పాటు అటు ఇటుగా పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో చికెన్ అమ్మకాలు తగ్గగా, దాణా ధర, విద్యుత్ చార్జీలు, కోడి పిల్లల ధర పెరగడంతో పౌల్ట్రీ రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. కోళ్ల పెంపకానికి అయ్యే ఖర్చు వచ్చే ఆదాయానికి సరిపోతుండటంతో శ్రమ వృథా అవుతుందని పౌల్ట్రీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. దాదాపు 1.40కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. కిలో కోడి పెంపకానికి, మార్కెట్ చేరుకోవడానికి రవాణా ఖర్చు రూ.150 వస్తుండగా, రిటైల్ ధర రూ.120గా ఉంది. దీంతో ఆదాయం లేకపోగా నష్టాలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క పక్క పెరుగుతున్న దాణా రేటు, తగ్గిన చికెన్ వినియోగం, ధర లేమి పౌల్ట్రీ రంగం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం అవుతుంది.



ధరల నిలకడ కరువు

కేజీ బాయిలర్ కోడి సోమవారం రైతు ధర రూ. 108 కాగా రిటైల్ ధర రూ 140 కి చేరింది. కేజీ చికెన్ ధర రూ.200 కాగా స్కిన్ లెస్ రిటైల్ మార్కెట్లోరూ.220 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. కోడిగుడ్డు ధర హోల్సేల్ రూ.4.15 మాత్రమే. కనీసంగా బాయిలర్ కోడి కేజీ రూ.130, గుడ్డు ధర రూ .5 చెల్లిస్తేనే గిట్టుబాటు అవుతుందని పౌల్ట్రీ రైతులు చెప్తున్నారు .ఉమ్మడి జిల్లాలో 300 పౌల్ట్రీ ఉండగా, 1. 40 కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. రాష్ట్రంలో ఐదు కోట్ల కోళ్ల పెంపకం సరాసరిగా ఉత్పత్తి జరుగుతుందని అంచనాగా తెలుస్తుంది. దీనిలో 30 శాతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉత్పత్తి జరుగుతోంది. ప్రత్యక్షంగా 20 వేలమంది, పరోక్షంగా మరో 20 వేల మంది మొత్తం 40 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమకు లారీ పరిశ్రమ అనుబంధంగా ఉపాధి లభిస్తుంది. రైతుల వద్ద కోళ్లను కొనుగోలు చేసి లారీ యాజమాన్యాలు ఒరిస్సా బీహార్ బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటాయి. అత్యధికంగా ఎగుమతి జరిగే బీహార్, బెంగాల్, ఒడిశా ప్రాంతాలలో అక్కడ ప్రభుత్వాలు ప్రోత్సాహం ఫలితంగా పౌల్ట్రీ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఈ ప్రభావం జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమపై గోరుచుట్టుపై రోకలి పోటు లా మారింది.

క్రమేపీ తగ్గుతున్న రాబడి

కోళ్ల ఫారాలలో బ్యాచ్‌లు వేసేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. ఏటా పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవటం రాబడి క్రమ క్రమంగా తగ్గిపోవటమే కారణమని రైతులు చెబుతున్నారు. కోడి పిల్ల ధర రూ.35. లేబర్ చార్జీ రూ.6, మెడిసిన్ ఖర్చు రూ.10, కరెంట్ బిల్లు రూ.1, వరిపొట్టుకు రూ.5,ఇతర ఖర్చులు రూ.3, ట్రేడర్ తరుగుదల కింద రూ.40, మొత్తంగా రెండు కిలోల కోడి పెంపకానికి రూ.240 ఖర్చు అవుతోంది. కిలో లైవ్ కోడి రూ.130 చొప్పున విక్రయిస్తే కొంత మేర ఆశాజనకంటా ఉన్నట్లేనని రైతులు చెబుతున్నారు. కోళ్లఫాంలో 10వేల కోళ్లను పెంచితే కోడికి(2కిలోలు) రూ.240 చొప్పున రెండు నెలలకు సుమారు రూ.24లక్షల ఖర్చుఅవుతోంది. కోళ్ల పెంపకానికి మొక్కజొన్న, సో యా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18వేల నుంచి రూ.25వేలు, సోయా రూ.50వేల నుంచి రూ.80వేలకు పెరిగింది. దీంతో దాణా ఖర్చు రెట్టింపైంది. అదే స్థాయిలో కోడి ధర పెరగకపోవడంతో నష్టాలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు.సాధారణంగా రెం డు కిలోల కోడిగా ఎదిగేందుకు రెండు నెలల సమయం పడుతుంది. ఈ కాలంలో కోడి మూడున్నర కిలోల దాణా తింటుంది. కిలో దాణాకు రూ.60 వ్యయం అనుకుంటే, మూడున్న ర కిలోలకు రూ.210 వరకు ఖర్చు వస్తుంది. దీంతోఈ ఏడాది 25 శాతం మంది రైతులు కొత్తబ్యాచ్‌లు వేయలేదు.

ప్రభుత్వం ఆదుకోవాలి

పౌల్ట్రీ రంగం అంపశయ్యపై ఉంది. గత నాలుగున్నర దశాబ్దాలుగా ఈ రంగంలో ఉన్నాను. గత పదేళ్లుగా నష్టాలే తప్ప రైతులు లాభాలు చూడటంలేదు. ప్రస్తుతం గుడ్డు ధర రూ.4.15 మాత్రమే. కనీసం రు.5చొప్పున చెల్లిస్తేనే పౌల్ట్రీ పరిశ్రమతో పాటు అనుబంధ రంగమైన లారీ పరిశ్రమకు ఊరట కలుగుతోంది. లేనిపక్షంలో నష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోకుంటే ఈ రంగం పూర్తిగా మూతపడుతుంది.

-నల్లమిల్లి వీరెడ్డి ఆల్తమూరు పౌల్ట్రీ రైతు

చికెన్ ధరలు ఆశాజనకంగా లేవు

చికెన్ ధరలు కొంతకాలంగా ఆశాజనకంగా లేవు. ఏడాదిలో ఒకటి లేదా రెండు నెలలు మాత్రమే గిట్టుబాటు ధర వస్తుంది. మిగిలిన కాలమంతా నష్టాలు తప్పటంలేదు. ఈ ఏడాది అత్యధిక మంది రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు. ఫలితంగానే ప్రస్తుతం లైవ్ కేజీ రూ.108 చొప్పున కొనుగోలు జరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం లేక తొలుత పౌల్ట్రీ రంగం నష్ట పోవటంతో పాటు అనుబంధ వ్యాపారాలపైనా ప్రభావం చూపుతోంది.

-బి. హరి దుర్గా ప్రసాద్ చికెన్ హోల్ సేల్ వ్యాపారి

'స్పందన'లో 28 దరఖాస్తులు

రాజమహేంద్రవరం కమిషనర్ కె.దినేష్‌కుమార్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో 28 దరఖాస్తులు వచ్చాయని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రజలు నుంచి స్పందన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యలు త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అమలు కానీ వారిని జగనన్న సురక్ష ద్వారా గుర్తించి ఆ పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు యం.నాగు, యం. సోమాలమ్మ, మాకు 3 నెలలు బట్టి జీతాలు లేవు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

మాకు పని వత్తిడి కూడా బాగా ఎక్కువగా ఉందని తెలియజేయగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ .దినేష్ కుమార్ వెంటనే స్పందించి ప్రతీ నెల జీతం వచ్చే విధంగా చూడాలని సంబధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమినర్ పియం. సత్యవేణి, డిప్యూటి కమిషనరు జి.సాంబశివరావు, సిటీ ప్లానర్ వైబీఆర్ చంద్రబోస్, సూపరింటెండెంట్ ఇంజనీరు జి. పాండు రంగారావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న మరియు ఇతర మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

గోకవరం ఆస్పత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిని తూర్పు గోదావరి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ యస్వంత్ కుమార్ సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అందించే వివిధ సేవల మీద ఆరాతీశారు. ఖర్చు తో కూడిన కేసులకు ఆపరేషన్స్ నిర్వహించి ప్రజలకు సేవలు అందించుటలో ఆసుపత్రి ప్రధాన వైద్యురాలు డాక్టర్ వనజకుమారిని అభినందించారు అలాగే ఆసుపత్రి లో లేబర్ రూమ్ వివిధ రూమ్స్ పరిశీలించారు కొత్తగా నిర్మాణం లో నున్న ఆసుపత్రిని పరిశీలించారు సెప్టెంబర్ నెలాఖరులోగా క్రింది భాగం తయారు చేసి ఇస్తారని నిర్మాణ విభాగం వారు తెలిపగా పనులు త్వరితంగా పూర్తి చేయమని తెలిపారు ఈ కార్యక్రమంలో డిసిఎస్‌హెచ్ సనత్ కుమారి, వైద్యులు డాక్టర్ రవి, డాక్టర్ ఝూన్సీ, డాక్టర్ గంగాధర్, డాక్టర్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ప్రజాశక్తి-రాజమహేంద్రరవం

ఎస్‌కెవిటి గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో నేషనల్ లైబ్రరీస్ డే సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పితామహునిగా పేరుందిన డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ డివి.రమణ మూర్తి తదితరులు రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మ్యాథ్స్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ జి.శరత్ బాబు ప్రసంగించారు. డాక్టర్ రమణమూర్తి మాట్లాడుతూ భారతదేశంలో అకాడమిక్ లైబ్రరీలతో పాటు పబ్లిక్ లైబ్రరీలో అభివృద్ధికి గ్రంథాలయ వ్యవస్థ వికాసానికి విశేషంగా కృషి చేసిన రంగనాథన్ జయంతి ఆగస్టు 12ను జాతీయ గ్రంథాలయ దినోత్సవం గా ప్రకటించారన్నారు. కార్యక్రమంలో లైబ్రరీ సిబ్బంది, కంప్యూటర్ డిపార్ట్మెంట్ రాజేష్, తెలుగు డిపార్ట్మెంట్, మ్యాథమెటిక్స్ డిపార్ట్మెంట్ రవి కృష్ణ, సంజీవరావు, సూపరింటెండెంట్ నరసింహారావు, నాన్ టీచింగ్ సిబ్బంది సత్య నారాయణ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఏర్పాటుకు తీర్మానం

జిల్లా నూర్‌బాషా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కడియం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూర్ భాషా అసోసియేషన్ సర్వసభ్య సమావేశం కడియం గ్రామంలో గల మసీదు ఆవరణలో సోమవారం జరిగింది. రాష్ట్ర నూర్ బాషా దూదేకుల అసోసియేషన్ అధ్యక్షులు పీర్ మహమ్మద్ ఆదేశాల మేరకు, షేక్ సుభాన్ ముఖ్యఅతిథిగా, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు షేక్ సలీం అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూర్ భాషాలు రాజకీయపరంగా, సామాజిక పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మూడు జిల్లాలుగా మారిన సందర్భంలో మూడు జిల్లాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానం చేశారు. ముందుగా నూతన తూర్పుగోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన షేక్ సలీం ను మరలా జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకొని రాష్ట్ర కమిటీకి నివేదిక పంపాలని కమిటీ తీర్మానం చేసింది. షేక్ సుభాన్ మాట్లాడుతూ జరగబోయే రాష్ట్ర బాడీ మీటింగ్ లో చర్చించి, మిగతా రెండు (కోనసీమ,కాకినాడ) జిల్లాలకు కూడా త్వరలోనే కమిటీలను నియమిస్తామని తెలిపారు సమావేశంలో మండపేటకు చెందిన పారిశ్రామికవేత్త షేక్ మౌలానా, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనరల్ సెక్రెటరీ షేక్ మస్తాన్, మండపేట టౌన్ అధ్యక్షులు షేక్ ఇబ్రహీం, కపిలేశ్వరం మండల కమిటీ అధ్యక్షులు షేక్ వలి, ఆలమూరు మండల కమిటీ అధ్యక్షులు షేక్ సలీం, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - నిడదవోలు

దేశంలో మహిళల పై దాడులు, హింస అరికట్టాలని కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో జెంట్రీ టైలర్స్ నేతత్వంలో తయారీ చేసిన 750అడుగుల జాతీయ పతాకంతో నిడదవోలు పట్టణంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. కెవిపిఎస్ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్య వచ్చిన 77ఏళ్ల తర్వాత కూడా లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశంలో మహిళలపై దాడులు, కులవివక్ష, ఉన్మాదం వంటివి మన దేశంలోనే చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. యువకులు, విద్యార్థులు, తమ దేశ భక్తిని చాటుకుంటూ భారత్ మాతాకి జై, మహిళలు, చిన్నారుల్లై అఘాయిత్యాలను అరికట్టాలని మత సామరస్యం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ప్రదర్శన పట్టణ ప్రజలను ఆకట్టుకుంది.



వేములూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పాటిమీద గణేష్ చౌక్ వరకు ప్రదర్శన కొనసాగింది. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జువ్వల రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాంబాబు, భాస్కర్, తూరుగోపు నాని, సిఐటియు నాయకులు గంటి కష్ణ, డివైఎఫ్ఐ నాయకులు గారపాటి ప్రసన్న కృష్ణ, మాజీ సైనికులు వారియర్స్ జిమ్ అధినేత బొచ్చా కష్ణా, దళిత మహా సభ నాయకులు పిల్లి సురేష్, దళిత ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు చోళ్ళ రాజు, కెవిపిఎస్ నాయకులు నల్లా లెనిన్, మిక్కిలి అనిల్ కుమార్ ఆటో యూనియన్ నాయకులు ఎల్లే కష్ణం రాజు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ఘటనలకు నిరసన

కొవ్వూరు రూరల్: మణిపూర్ రాష్ట్రంలో జరిగినటువంటి అవమానవీయమైన ఘటనను నిరసిస్తూ అక్కడి ప్రజలకు శాంతి నెలకొల్పాలని కోరుతూ వేములూరు గ్రామంలోని పాస్టర్లు, మరియు స్థానిక మానవతా వాదుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో సుమారు 400 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ ర్యాలీని స్థానిక నాయకులు మరపట్ల కళాధర చక్రవర్తి ప్రారంభించి మాట్లాడారు. వేములూరులో ప్రారంభమయ్యిన శాంతి ర్యాలీ తొగుమ్మి గ్రామం వరకు నిర్వహించారు. మానవ హక్కులు కాపాడండి, మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పండి అని పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. కార్యక్రమంలో జైభీమ్ యూత్ సభ్యులు వారా మలాకీ, మానవతావాదులు ఇమ్మానిశ్రీను, విజయ్‌బాబు తదితరులు ప్రసంగించారు. తొగుమ్మి సేవకులు సంఘీభావంగా పాల్గొన్నారు. **గోకవరం:** మండల కేంద్రమైన గోకవరంలో ఇమ్మానుయేలు



నిడదవోలు పట్టణంలో భారీ జాతీయ జెండా ప్రదర్శన

పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మణిపూర్ రాష్ట్రంలో జరిగిన ఘటనలకు కారకులైన వారిని వెంటనే శిక్షించాలని సోమవారం ఆర్ అండ్ ఆర్ కాలనీ నుండి ఎంట్రన్స్ గేటు వరకు శాంతి ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. కార్యక్రమం లో సుమారు 200 మంది పాస్టర్స్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో రంపచోడవరం రీజనల్ ఛైర్మన్ టి.ప్రభు దాసు, పాస్టరు, ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.



గోకవరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు



సచివాలయాన్నిప్రారంభిస్తున్నచందనతదితరులు

గ్రామస్థాయి నుంచే అభివృద్ధి జరగాలి

ప్రజాశక్తి-కడియం

అభివృద్ధి అనేది గ్రామస్థాయి నుంచే ఉండాలని, అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. బుర్రిలంక గ్రామంలో సోమవారం సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చందన నాగేశ్వర్, డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు లు పాల్గొని మాట్లాడుతూ పరిపాలన అనేది ఎప్పుడు ఒకచోటే కేంద్రీకతం కాకూడదని, అందరికి అందుబాటులో ఉండాలని వైఎస్ జగన్ ధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయం వ్యవస్థను ప్రారంభించారన్నారు. దీని వలన ప్రజలకు తగిన సేవలను సకాలంలో అందజేయడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన ఎరువులు అందించడం జరుగుతుందని, పంట కొనుగోలుకు మార్గం సుగుమం అవుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు , మండల వైసిపి అధ్యక్షులు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, జెసిఎస్ ఇంచార్జ్ తాడాల చక్రవర్తి, కడియపులంక సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ, ఎంపిటిసి సభ్యురాలు అన్నందేవుల సుబ్బలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

19న దమ్మెన్ను 9వ వార్డు ఉప ఎన్నిక

ప్రజాశక్తి- ఉంద్రాజవరం

దమ్మెన్ను పంచాయతీ తొమ్మిదవ వార్డుకు ఉప ఎన్నిక ఈనెల 19న నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి సరోజిని సోమవారం తెలిపారు. రాష్ట్రంలో వివిధ కారణాలవల్ల ఖాళీగా ఉన్న పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల కు నిర్వహించాల్సిన ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడడంతో మండలంలోని కె. సావరం11 వ వార్డుకు ఒక నామినేషన్, దమ్మెన్ను 9 వార్డుకు 5 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ ప్రకారం ఒక నామినేషన్ దాఖలైన కె.సావరం ఏకగ్రీవం కాగా, దమ్మెన్ను లో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం కొడవటి సూరి పండు (ఎస్‌సి), మట్టపర్తి అచ్యుత రామయ్య (ఒసి) అభ్యర్థులు బరిలో నిలిచారు. దీనితో ఈ గ్రామంలో ఎన్నిక అనివార్యమైంది.

పంగిడి పంచాయతీలో..

కొవ్వూరు రూరల్: పంగిడి పంచాయతీ లో ఖాళీ ఏర్పడిన 8వ వార్డు కొరకు ఈ నెల 19న జరిగే ఎన్నికల కొరకు 6గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖాలు చేశారని, వీరిలో 4గురు తమ నామినేషన్లు గడువు ముగిసేలోగా ఉపశంహరించుకున్నారని ఎన్నికల అధికారి కె.రామాకిశోర్ సోమవారం తెలిపారు. శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు పోలింగ్ జరుగుతుందన్నారు. 4 గంటలకు లెక్కిస్తామన్నారు.

జలజీవన్‌తో ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి -గోకవరం

రంపఎర్రంపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ బాదంపూడి హర్షిత ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ ద్వారా నూతనంగా పైప్‌లైన్ కి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా గోకవరం మండలం వైసిపి కన్వీనర్ పాటి రాంబాబు పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా నూతనంగా పైపులైను వేసి ఇంటింటికి మంచినీటి కుళాయిలలో భాగంగా కుళాయిలు లేనివారి ఇళ్లకు ఈ పథకం ద్వారా నూతనంగా కుళాయిలు ఇస్తారన్నారు. గ్రామంలో ఏ వీధిలో పైపులైను లేవో ఆ వీధిలో నూతనంగా పైపులైన్లు వేసి కుళాయిలు ఏర్పాటుచేస్తారన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దాకారపు ధర్మరాజు, టి.సత్యనారాయణ, పాటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'నాభూమి-నాదేశం'

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల నా భూమి-నాదేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వివరాలు ఇవి..

రాజానగరం : ఆదికవి నన్నయ యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆవరణలో మేరా మిట్టీ మేరాదేశ్ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఎస్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో విత్తన నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయ నిర్మల, కార్యక్రమాన్ని ప్రారంభించి కళాశాల ఆవరణంలో విత్తనాలు నాటారు. వివిధ రకాల కూరగాయ విత్తనాలను నాటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **చాగల్లు** : అజాదీకా అమత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు మరియు గ్రామ పంచాయతీ వద్ద కార్మిక నిర్వహించారు. చాగల్లుగ్రామంలో గ్రామ సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి ఆధ్వర్యంలో నా భూమి- నా దేశం కార్యక్రమం లో భాగంగా షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద నుంచి గ్రామపంచాయతీ వద్ద ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మనశ్శాంతి మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించడం తెలిపారు. చాగల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాల గ్రౌండ్లో గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించినట్లు ప్రధాన ఉపాధ్యాయులు పి వీర్రాజు తెలిపారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ముద్రగడ కష్ణ భగవాన్ ఉపాధ్యాయులు స్కూల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. **సీతానగరం**: సోమవారం రఘుదేవపురం సచివాలయం వద్ద నా భూమి -నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ చంద్రలీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపిపి గుర్రాల జ్యోత్స్నా ముఖ్య అతిథిగా



దేవరపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిజ్ఞ చేస్తున్న ఎంఎల్ఎ వెంకట్రావు

హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. అనంతరం ఎంపిడిఓ రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఓ నాగశేషవేణి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు, మేట్లు తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి:** దేవరపల్లి పంచాయతీలో నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన పంచాయతీలో ఏర్పాటుచేసిన నా భూమి నా దేశం శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కెవికె.దుర్గారావు, జెడ్‌పిటిసి సభ్యురాలు స్వర్ణలత, సర్పంచ్ కడిమి వీర కుమారి, తదితరులు పాల్గొన్నారు. **గోకవరం:** గ్రామపంచాయతీ నందు గ్రామ సర్పంచ్ కోమరం శ్రావణి ఆధ్వర్యంలో నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు ముఖ్య అతిథులుగా గోకవరం ఎంపిపి సుంకర శ్రీవల్లి భర్త సుంకర వీరబాబు పాల్గొన్నారు. అనంతరం ఆవరణలో కొబ్బరి మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వరసాల ప్రసాద్, తోలేటి రాంప్రసాద్, మందపాటి సతీష్, తుమ్మల శివాజీ, పదిలం అప్పారావు, బొడ్డపాటి వీరచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

ఇటీవల కాలంలో ములకల్లంక గ్రామంలో మతి చెందిన పలువురి కుటుంబాలను రాజానగరం టిడిపి ఇన్చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి సోమవారం పరామర్శించారు. ములకల్లంకలో బాధితుల గహాలను సందర్శించారు. కంటిపూడి సత్యనారాయణ చిన్న కుమారుడు సూరిబాబు కుటుంబాన్ని, పోలిన సీతారామయ్య తల్లి సీతమ్మ మరణించడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీతానగరం మండల టిడిపి నాయకులు, ములకల్లంక టిడిపి గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోడాలకు అబ్దుల్ సేవా రత్న అవార్డు

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ మానవతా సేవా సంస్థ జిల్లా కమిటీలో ప్రధాన పాత్ర పోషిస్తున్న తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయ గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు అబ్దుల్ కలాం సేవ రత్న అవార్డు అందుకున్నారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న పలువురు ప్రముఖులకు సోమవారం తాడేపల్లిగూడెలో జరిగిన ఒక కార్యక్రమంలో అవార్డులు అందజేశారని తాళ్లపూడిలో జోడాల విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు ఆర్ నాగ బుజ్జి ఆధ్వర్యంలో అవార్డు అందుకున్నామని ఆయన తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రాజానగరం

మండలం రాజానగరంలో రూ. 8 కోట్ల 38 లక్షలతో అభివద్ధి పనులను ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, జిఎస్ఎల్ మెడికల్ కాలేజీ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కర రావు సోమవారం ప్రారంభించారు. అనంతరం రాజానగరం, వెంకటాపురం, శ్రీరామ్ నగర్ గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు వెలుగుబందలో 25 ఎకరాలలో 970 మంది జగనన్న ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి లోని మాంటిస్సోరి విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్లే గ్రౌండ్లో సోమవారం ఇండియా ఆకారంలో నిలుచుని ప్రదర్శన చేశారు. ఈ చిన్నారులు చేసిన అక్షర ప్రదర్శన ఎంతగానో ఆకర్షించింది. మంగళవారం ర్యాలీ నిర్వహించడానికి పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసింది.

కార్టూ'నిజం'



సాగునీటిని విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గంలోని పొలాలకు పుష్కర కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలంటూ తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. గండేపల్లి మండల పరిధిలో ఉన్న తాళ్లూరు, రాజపూడి, నాయకంపల్లి లిఫ్ట్‌ల మరమ్మతులు చేసి పుష్కర నీటిని వెంటనే విడుదల చేయాలని నినదించారు. తొలుత టిడిపి కార్యాలయం నుంచి జగ్గంపేట సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడారు. నెల రోజుల క్రితమే సాగునీటి ఇబ్బందులపై అధికారులు, ప్రజాప్రతినిధులను కోరామన్నారు. అనంతరం ఉమ్మడి గోదావరి జిల్లాల నేతలతో బస్సు యాత్ర చేసి తాళ్లూరు, రాజపూడి లిఫ్టులను పరిశీలించామన్నారు. అయినా అధికారుల్లో స్పందన లేదన్నారు. అధికారుల తీరుకు నిరసనగా ధర్నా చేశామన్నారు. ఇప్పటికైనా స్పందించి సాగు నీరు అందించాలన్నారు. లేకుంటే కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వివిఎస్.అప్పలరాజు, వేములకొండ జోగారావు, కొత్త కొండబాబు, బుల్లియ చౌదరి, రేఖ బుల్లిరాజు, బండారు చిన్నయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహిస్తున్న జ్యోతుల నెహ్రూ

నేరాలు ఘోరాలు

ఎరువుల దుకాణంలో విజిలెన్స్

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని అర్తమూరులో శ్రీ లక్ష్మి చెన్నకేశవ ఏజెన్సీస్ దుకాణంలో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేకపోవడం, స్టాక్ బోర్డు అప్‌డేట్ చేయకపోవడం, గ్రౌండ్ స్టాక్‌కు, స్టాక్ రిజిస్టర్‌కు తేడాలు ఉండటంతో షాపుపై 6ఎ కేసు నమోదు చేశారు. సుమారు రూ.1,865 విలువ గల 315 కిలోల యూరియాను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్స్పెక్టర్ రమేష్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

మీనానగరంలో సెబ్ తనిఖీలు

ప్రజాశక్తి - చాగల్లు

కొవ్వూరు సెబ్ స్టేషన్ పరిధిలో చాగల్లు గ్రామ శివారు మీనానగరంలో సెబ్ ఇన్స్పెక్టర్ ఇటివిఆర్.సత్యనారాయణ దేశాలు మేరకు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సారా కేసులో పాతనేరస్తుడు బెజవాడ శ్రీనివాసరావును అదుపులోనికి తీసుకుని తహశీల్దార్ ఎదుట హాజరుపర్చారు. బైండోవర్ చేశామని సత్యనారాయణ తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సెల్ ఫోన్ ఎక్కువగా చూస్తున్నాడని తల్లిదండ్రులు మందలించడంతో సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామానికి చెందిన గుబ్బల సురేష్(14) ఇంటి నుంచి పరారయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సైకిల్ రిపేర్ చేయించుకుంటానని చెప్పి అలిగి ఇంట్లోంచి వెళ్లిపోయాడని తండ్రి గుబ్బల నాగేశ్వరరావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సురేష్ ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఎరుపు నలుపు చారల టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. బాలుని ఆచూకీ తెలిస్తే సామర్లకోట సిఐ 9440796568, ఎస్ఐ 9701626506 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సిఐ దుర్గాప్రసాద్ కోరారు.

ఎసిబి వలలో లైన్‌మ్యాన్

ప్రజాశక్తి- అన్నవరం

ఎసిబి వలలో లైన్‌మ్యాన్ చిక్కాడు. సోమవారం శంకవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన ఎస్.శ్రీను అనే రైతు తన పొలంలో బోర్ వేసికొనేందుకు లైన్‌మ్యాన్ అల్లు తాతాజీ రూ.5 వేలు లంచం అడిగాడు. దీంతో రైతు శ్రీను ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. శంకవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లంచం తీసుకుంటుండగా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి శివారు జాతీయ రహదారిపై ఎన్‌టి.రాజాపురం కూడలి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గూడాల నవీన్ కుమార్ బైకుపై రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్‌కుమార్ ఎగిరి మరొక కారుపై పడటంతో తలకు తీవ్రగాయమైంది. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని యువకుడిని రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్ తీసుకెళ్లారు.

17న వికాసలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కాకినాడ

వికాస కార్యాలయంలో ఈ నెల 17న డబ్ల్యుఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీలో మెడికల్ కోడింగ్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కెఎల్.రావు సోమవారం ప్రకటనలో తెలిపారు. బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బిఎస్‌సి లైఫ్ సైన్స్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.2లక్షల జీతం, ఇన్సెంటివ్స్ ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 17న కలెక్టరేట్ ప్రాంగణంలో వికాస కార్యాలయం వద్ద ఉదయం 9గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్సులతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7799376444 నెంబర్‌ను లేదా www.vikasajobs.com వెబ్ సైట్‌ను సంప్రదించలన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యానాం

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు స్థానిక బాలయోగి స్టేడియం ముస్తాబైంది. మంగళవారం జరిగే వేడుకలకు పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని ఆర్ఎఒ తెలిపారు.

సీనరేజి వసూలుకు డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం తూరంగి పంచాయతీ పరిధిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేయిస్తున్న లే అవుట్లలో నింపుతున్న గ్రావెల్‌కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించిన సీనరేజీ చెల్లించారా లేదా సంబంధిత భూ యజమానుల రికార్డులు తనిఖీ చేసి నిగ్గు తేల్చాలని ఎంపిటిసి మాజీ సభ్యులు పితాని వెంకటరాము స్పందనలో ఫిర్యాదు చేశారు. తూరంగిలో వందలాది ఎకరాల్లో లేఔట్లు వేస్తూ గ్రావెల్‌తో పూడ్చుతున్నారన్నారు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలన్నారు. ఫిల్లింగ్, మైనింగ్, విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి రావాల్సిన సొమ్మును పూర్తిగా జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి- కాకినాడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం కలెక్టరేట్‌లో డాక్టర్ కృతికాశ్లుక్లా కారుణ్య నియామకం కింద ఇద్దరికి నియామక పత్రాలను అందించారు. గ్రామ సచివాలయంలో గ్రేడ్-2 విఆర్ఒ, సంక్షేమం అండ్ విద్యా కార్యదర్శిగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు.

అమరుల త్యాగాల వల్లే స్వాతంత్య్ర ఫలాలు

అమరవీరుల కుటుంబాలకు ఘన సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

అమరవీరుల త్యాగాలవల్లే స్వాతంత్రోద్యమ ఫలాలను అనుభవించ గలుగుతున్నామని ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. అజాదిక అమత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక వివేకానందపార్కు ఆవరణలో 'నా భూమి- నా దేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి పద్మశ్రీ, కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైసిపి నగర అధ్యక్షులు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మార్కెట్‌కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. తొలుత పార్కు ఆవరణలోని భరతమాత విగ్రహానికి, స్వాతంత్రోద్యమకారుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కార్గిల్‌తోపాటు భారతసరిహద్దులను, నక్సలైట్ల చేతుల్లో హతమైన అమరుల కుటుంబ సభ్యులను సత్కరించారు. పార్కు ఆవరణలో మొక్కలు నాటారు. అమరవీరుల పేరిట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ సత్యప్రసాద్, ఎస్ఇ సత్యకుమారి, కార్యదర్శి ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డిసిపి హరిదాసు, ఎసిపి నాగశాస్త్రులు, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల గొడౌన్ పరిశీలన

కాకినాడ : కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం, వివిప్యాడ్‌ల గొడౌన్‌ను కలెక్టర్ కృతికాశుక్లా రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ప్రతి నెలా గోడౌన్లను తనిఖీ చేసి నివేదిక పంపిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ, తహశీల్దార్ సీతాపతిరావు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

ప్రజాశక్తి -కరప

గురజానపల్లి స్కూలుకు రూ.45వేల విలువ చేసే సౌండ్ సిస్టంను దాత డాక్టర్ విష్ణుమూర్తి అందించినట్లు హెచ్ఎం ఎ.సాయిమోహన్ తెలిపారు. సోమవారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీన్ని డాక్టర్ విష్ణుమూర్తి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నాను అన్నారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివి.రమణమూర్తి, టి.వేణుగోపాల్, ఎ.సూర్యనారాయణ, శోభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

జగన్ పాలనలో దళితులకు అన్యాయం

ప్రజాశక్తి - కోటనందూరు

జగన్ పాలనలో దళితులకు అన్యాయం జరిగిందని టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు కొల్లాబత్తుల అప్పారావు అన్నారు. తునిలోని టిడిపి కార్యాలయంలో పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు అధ్యక్షతన సోమవారం నియోజకవర్గం ఎస్‌సి సెల్ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అప్పారావు మాట్లాడారు. దళిత ఓట్లతో అధికారంలోకొచ్చిన జగన్ ఈ నాలుగున్నరేళ్లలో ఎక్కువ అన్యాయం చేసింది దళితులకే అన్నారు. బాబు హయాంలో క్రిస్మస్ కానుక, పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారన్నారు. జగన్ అధికారం చేపట్టిన తరువాత వీటిని రద్దు చేశారన్నారు. జగన్ పాలంలో నిత్యావసర వస్తువులు ధరల విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. ఎస్‌సికార్పొరేషన్ నిధులు దారి మళ్లించి అన్యాయం చేశారన్నారు. ఈ పలివెల రవి, అనంత కుమార్, ఎన్.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ఎ.జార్జి తదతరులు పాల్గొన్నారు.



తనిఖీలు చేపడుతున్న ఆర్జెడి నాగమణి

జిఇఆర్ సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేను నూరు శాతం పూర్తిచేసేలా విద్యాశాఖ సిబ్బంది కృషి చేయాలని ఆర్‌జెడి నాగమణి ఆదేశించారు. సోమవారం సామర్లకోటలోని జగ్గమ్మ గారి పేట మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. జగనన్న విద్యా కానుక, మధ్యాహ్నం భోజన పథకం, హాజరు పట్టీలను పరిశీలించారు. నాగమణి మాట్లాడుతూ బడి ఈడు గల పిల్లలందరు బడిలో ఉండే నిమిత్తం కొన్ని రోజులుగా సర్వే జరుగుతుందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్ పరిధిలో ఉన్న యాప్ ద్వారా ఈ సర్వే పూర్తి చేసి ఎన్‌రోల్‌మెంట్ పెంచే విధంగా చూడాలన్నారు. తగిన శ్రద్ధ తీసుకుని జిఇఆర్ సర్వే నూరుశాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 పి.పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనూరు దళితపేటలో మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆనూరు దళితపేటలో మౌలిక వసతులు కల్పించాలని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలనీలో 20 ఏళ్లుగా దళితులు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. నేటికీ విద్యుత్, మరుగుదొడ్లు, డ్రెయినేజీ వంటి సదుపాయాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, నాయకులు డి.సురేష్, పి.బులిసత్తయ్య, పి.నాగరాజు, సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మంత్రి లక్ష్మీనారాయణన్‌కు ఎంఎల్ఎ స్వాగతం

ప్రజాశక్తి - యానాం

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు యానాం విచ్చేసిన పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్‌కు స్థానిక ప్రభుత్వ అతిథిగృహం వద్ద ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ సోమవారం ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. అనంతరం యానాం నియోజకవర్గంలో ఉన్న పలు అంశాలపై చర్చించారు. దానిలో ముఖ్యంగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అందుకు ఆర్ఒ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సాగునీరు అందక పంట భూములు ఎండిపోతున్నాయని అన్నారు. రోడ్ల నిర్మాణం కోసం నిధులు విడుదలైనా పనులు మాత్రం ముందుకు సాగడం లేదని మంత్రికి వివరించారు. ప్రతి ఏటా వరద ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, దానికి సంబంధించి రూ.190 కోట్లతో రక్షణ గట్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. అధికారులతో సమీక్షించి సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి లక్ష్మీనారాయణన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



మంత్రిని సత్కరిస్తున్న ఎంఎల్ఎ అశోక్

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప రీజెన్సీ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న సుమారు 32 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బిసి సంఘాల నాయకులు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. బయన్న, మట్టపర్తి చిన్న, కర్రి రాంబాబుతో పాటు కొంత మంది వ్యక్తులు కలిసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి భూమిని కబ్జా చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గత నాయకుల అండదండలతో బయన్న అనే వ్యక్తి ప్రభుత్వ భూములు కబ్జా చేశాడని ఆరోపించారు. తమ దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయని నాయకులు, బాధితులు ఎంఎల్ఎ అశోక్‌కు వివరించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు త్వరలో ఫిర్యాదు చేసి భూ కబ్జాదారులకు శిక్షపడేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిసి నాయకుడు పెద్దింశెట్టి వెంకటేశ్వర్లు, మల్లాడి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ సమక్షంలో ఆర్ఎఒ మునిస్వామి, పిడబ్ల్యుడి అధికారులు, మత్స్యశాఖ అధికారులతో మంత్రి లక్ష్మీనారాయణన్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. మత్స్యకారులకు రావాల్సిన నష్టపరిహారంపై మత్స్య శాఖ అధికారులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఇఇ వీర సెల్వం, ఎఇ కాళ్ల నాగరాజు, పిల్లి భాస్కర్, మత్స్యశాఖ అధికారి డి.గొంతియ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో వారం రోజులుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మేరా మిట్టీ - మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ అరుల్‌ప్రకాశం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలోని ఎన్‌టిఆర్ స్మారక మందిరం అన్నా క్యాంటీన్ వద్ద టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో సోమవారం అన్నాదానం చేశారు. ముత్యాల సత్తిరాజు జ్ఞాపకార్థం అతని కుమారుడు గండేపల్లి మండలం యర్రంపాలెం తెలుగు రైతు అధ్యక్షులు ముత్యాల వీరభద్రరావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, గండేపల్లి, జగ్గంపేట మండలాల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం పాల్గొని పేదలకు అన్నం వడ్డించారు. మోహనరావు మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లను రద్దు చేయడం తదన్నారు. దీంతో స్వచ్ఛందంగా అన్నదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, బి.రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, కంటిపూడి రామారావు, ముత్యాల భాస్కరరావు, మాజీ సర్పంచ్ ముత్యాల వీరభద్రరావు, గుమ్మల్ల వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఓటర్ల సర్వేను బాధ్యతగా చేపట్టాలి

ప్రజాశక్తి - పెదపూడి

సమగ్ర ఓటర్ల జాబిత సర్వేను బాధ్యతగా చేపట్టాలని అనపర్తి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసు అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు, తొలగింపులు మొదలగు వాటికి సంబంధించిన క్లెయిమ్స్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఓటర్ల సవరణ మరింత కచ్చితంగా పారదర్శకంగా రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. సర్వేలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.సుభాష్, డిటి రామ్‌కుమార్, ఆర్ఐ ఎం.త్రివేణి, విఆర్ఒలు గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్, పంపన శ్రీనువాసు, చంటి తదితరులు పాల్గొన్నారు

తాటిపర్తిలో ప్రభుత్వ భవనాలకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తాటిపర్తిలో రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయం నూతన భవనం, విలేజ్ క్లినిక్ భవనాలను సోమవారం కాకినాడ ఎంపీ వంగా గీతా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరు దొరబాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ గోపు సూర్యక్రాంతి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ గీత మాట్లాడారు. మహాత్మా గాంధీ కలలగన్న గ్రామ స్వరాజ్యం జగన్మోహన్ రెడ్డి పాలన ద్వారానే సాధ్యమవుతుందన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ ప్రజల వద్దకు ప్రజా సంక్షేమాన్ని తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సభలో జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిరియాల రాజ, ఎంపిడిఒ అశోక్‌కుమార్, పిఎసిఎస్ చైర్మన్ గోపు నారాయణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కంటే వీర రాఘవరావు, ఆవాల లక్ష్మీనారాయణ, గోపు మురళి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని అమీనాబాద్ పంచాయతీ మాయాపట్నం ప్రజలు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ, తహశీల్దార్లకు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎపిఆర్‌సిఎస్ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు మాట్లాడారు. అమీనాబాద్ పంచాయతీ పరిధిలో మాయాపట్నం ప్రాంతంలోని ప్రజలు తాగునీరు అందక, ఉండడానికి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటింటికీ కొళాయి, పేదలందరికీ ఇళ్ల స్థలాలు అంటూ ప్రభుత్వం ప్రకటనలు గుప్పించడం తప్ప క్షేత్రస్థాయిలో సరిగా అమలు కావట్లేదన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా సముద్రం అలలకు తమ ప్రాంతం కోతకు గురై సముద్రంలో కలిసిపోతుందన్నారు. తాగునీటి కోసం సుదూరం ప్రయాణించి బిందె నీళ్ల రూ.20కి కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందన్నారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడితి సతీష్, కుంచె అంజిబాబు, ఏడిది పెద్దబంగారయ్య, వి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఒ ఆధ్వర్యంలో బ్యాగులు, పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి

నీలాద్రిరావు పేటలో విఆర్ఒ(గ్రామ పున్ణనిర్మాణ సంస్థ) ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. సంస్థ పిఒ శ్రీనువాస్, ఎపిఒ సుధాకర్, వాలంటీర్ రమాదేవి, ఎన్.పార్వతి, సర్పంచ్ ములంపాక సురేష్‌బాబు, గ్రామ పెద్దల సమక్షంలో వీటిని పంపిణీ చేశారు. సర్పంచ్ సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యను అందిచాలనే ఉద్దేశంతో విఆర్ఒ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌ను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా పోలీసు కవాతును ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాస్ పరిశీలించారు. కవాతులో లోపాలను గుర్తించి, సిబ్బందికి సూచనలు చేశారు. జాతీయ పతాకానికి వందనం చేసే సమయంలో మైదానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వారి వెంట అదనపు ఎస్‌పి(ఎఆర్) బి.సత్యనారాయణ, పెరేడ్ కమాండెంట్(ఎఆర్) డిఎస్‌పి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వాలు తిమ్మాపురం రహదారిలోని పట్టాభి అగ్రో ఫుడ్స్ లోహిత బ్రాండ్ ఆధ్వర్యంలో సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. హెచ్ఎం కె.శ్రీదేవి, డ్రాయింగ్ టీచర్ డి.భాస్కర మూర్తి పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని సంస్థ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణ, రాము తెలిపారు.

స్పందనకు ఐదు అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఐదు అర్జీలు అందాయని ఎఒ పద్మజ, డిప్యూటీ తహశీల్దార్ భానుకుమార్ తెలిపారు. స్థల ఆక్రమణదారులను ఖాళీ చేయించాలని, తొలగించిన విద్యుత్ మీటర్ పునరుద్ధరించాలని, భూమి రి సర్వే చేయించాలని అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఎడిఎ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.